సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆసరా పింఛన్లు పెంచాలి

మంచాల, అక్టోబర్ 22: ఆసరా పింఛన్లు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ పింఛన్లు పెంచకపోవడం సమంజసం కాదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. మంగళవారం మంచాల మండల కేంద్రంలో దివ్యాంగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో 5వేల మంది పింఛన్‌దారులతో మహాసభ నిర్వహించడమే కాకుండా నవంబర్ 26న రేవంత్‌రెడ్డి ఇల్లును ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీనివాస, బాలరాజ్, దానయ్య, సంజీవ, భాను, యాదమ్మ, అశ్వల బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

షాబాద్ మండలం తాళ్లపల్లి పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

షాబాద్, అక్టోబర్ 22: ప్రభుత్వం ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్సీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ విద్యాలయ అధ్యక్షుడు ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల డీఏలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, షాబాద్ ఉన్నత పాఠశాలల్లో ధర్మాగ్రహ దీక్షలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా ప్రముఖ్ సుమరంజిత, సంఘం సభ్యులు

కడ్తాల్, అక్టోబర్ 22: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రముఖ్ సుమరంజిత డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డీఏ, పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న బిల్లుల పరిష్కారం కోసం తపస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు, మంగళవారం మండల కేంద్రంతోపాటు పరిధిలోని ఆయా పాఠశాలల్లో తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమరంజిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడంలో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే చెల్లించాలని కోరుతూ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందన కరువైందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలను ఏరియర్స్‌తో సహ చెల్లించాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా నవంబర్ 5న కలెక్టరేట్ల ఎదుట ధర్నా, నవంబర్ 23న ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు ఆమె వివరించారు. అనంతరం ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మండలాధ్యక్షుడు సంతోశ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్, ఉపాధ్యాయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రగతినగర్ కాలనీ వాసులు

తుర్కయాంజాల్, అక్టోబర్ 22 : మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 22వార్డు ప్రగతి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రగతి నగర్ కాలనీ ఫేస్–2లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అదే విధంగా స్థానికంగా ఉన్న పలు కంపెనీల ద్వారా వెలువడే కాలుష్యంతో కాలనీలో నివసించలేకపోతున్నామని, వెంటనే అధికారులు స్పందించి ఆయా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ సమస్యలపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట సుబ్రమణ్యం, జాయింట్ సెక్రెటరీ బాలస్వామి, ప్రధాన కార్యదర్శి రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మొయినాబాద్‌లోని చిలుకూరులో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యులు

షాబాద్, అక్టోబర్ 22: పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని అంతారం, బోనగిరిపల్లి, సోలీపేట్, రేగడిదోస్వాడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు అనారోగ్యానికి గురికాక ముందే రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏడాదిలో రెండు విడుతలు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, శ్రీకాంత్, శ్రీనివాస్, సుధాకర్, బాల్‌రాజ్, రాణి, రైతులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే ఆర్థికంగా ఎదుగడానికి అవకాశం ఉంటుందని మండల పశువైద్యాధికారి ఎండీ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో మంగళవారం 152 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధి లక్షణాలను బట్టి ఏ వ్యాధి సోకిందో తెలుసుకోవడానికి పాడి రైతులు ప్రయత్నం చేయాలని అన్నారు. లక్షణాలను బట్టి వ్యాధిని నిర్ధారించుకుంటే వెంటనే వైద్యులను సంప్రదించి మందులు వాడి పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది కుమార్, భీంరావు, గోరేమియా, శ్రీనివాస్ ఉన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు

మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, అక్టోబర్ 22: ఆమనగల్లు సింగిల్‌విండో ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందజేస్తామని డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా తెలిపారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. నవంబర్ మొదటి వారంలో ఆమనగల్లు పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వరి క్వింటాలుకు రూ.2330 మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. ఆమనగల్లులో రెండు, కడ్తాల్ మండలంలో రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సన్న రకం వడ్లకు గాను ప్రోత్సాహకంగా రూ.500 అందించనుందని తెలిపారు. ఆమనగల్లు సింగిల్‌విండో, సహకార బ్యాంకుల ద్వారా గోట్ ఫామ్స్ (మేకలు, గొర్రెలకు సంబంధించి) ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, పౌల్ట్రీ, డెయిరీ, జేసీబీ, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రుణాలను అందిస్తామన్నారు. సమావేశంలో మాడ్గుల సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, ఆమనగల్లు సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, వెంకటయ్య, డీసీసీబీ మేనేజర్ గోపాల్, సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్, అల్లాజీ ఉన్నారు.

బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం, అక్టోబర్22: కేంద్రంలోని బీజేపీ మతరాజకీయాలకు పాల్పడుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ ఆరోపించారు. మండలంలోని చింతపట్ల గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సభను నిర్వహించారు. గ్రామంలో జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మోదీ సర్కార్ మతరాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. రైతులు, కార్మికుల చట్టాలను బీజేపీ కాలరాస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజన మహిళల మీద వరుస దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పేదలందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు, రైతులకు రైతు భరోసా ఇవ్వకుంటే రైతులే త్వరలో రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల ముందిచ్చిన హామీ ప్రకారం మహిళలకు నెలకు రూ.2500 నగదును అందజేయాలన్నారు. గ్రామశాఖ నూతన కార్యదర్శులుగా సత్యం, గిరికాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి నరసింహ, నాయకులు జంగయ్య, వెంకటయ్య, రమేశ్, ప్రభాకర్, శ్రీను, కాటంరాజు, గణేశ్, నాగరాజు, సురేశ్, మల్లేస్, పృథ్వీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 22 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి, దిగజారుడు మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులను బెదిరిస్తూ హింసను ప్రేరేపిస్తూ భయభ్రాంతులకు గురిచేసేలా అనుచితవ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భయభ్రాంతులకు గురిచేసే విధంగా మాట్లాడుతుండటం బీఆర్‌ఎస్‌పార్టీకి ఆందోళన కల్గిస్తున్నదని, 'అగ్ని కణికలై, మానవ బాంబులై నా కొడకల్లారా ఎవడన్నా మిగులుతే నేను చూస్తా అని, ఒక్కొక్కడిని పండవెట్టి తొక్కి పేగులు తీసి మెడలో ఊరేగుతం బిడ్డా' అనే మాటలు తన దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన అధినేత కేసీఆర్, వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులపట్ల మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. అభివృద్ధిలో ఉరకలు వేస్తున్న తెలంగాణ రాష్ట్రాన్ని అధికారంలోకి వచ్చిన అతితక్కువ కాలంలోనే సర్వనాశనం చేసిన రేవంత్‌రెడ్డి అభివృద్ధిని మరిచి... మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఇష్టానుసారంగా మాట్లాడటం మరిచి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు వీరేశ్, కరుణాకర్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో తులసీ

యాచారం, అక్టోబర్22: మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో తులసి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేశ్‌కుమార్ మానవ అక్రమ రవాణాకు సంబంధించి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ.. మనుషుల అక్రమ రవాణ నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో ఆడపిల్లల విక్రయాలు నేటికి కొనసాగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి అందరూ నడుం బిగిస్తేనే పూర్తిగా నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. నేరపూరిత చర్యను ప్రపంచానికి చాటి చెప్పి అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. దీనికోసం అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిత్రాశిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయాలి

ఆమనగల్లు, అక్టోబర్ 22: ఉపాధ్యాయుల డిప్యుటేషన్ వెంటనే రద్దు చేయాలని సోషలిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర కో– ఆర్డినేటర్ జంతుక శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేశామని చెబుతున్నా రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో వింత పరిస్థితి నెలకొందని ఆయన ఎద్దేవా చేశారు. కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీదేవి ఇటీవలే సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అదే విధంగా ఆమనగల్లు మండల కేంద్రంలోని 300 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న జ్యోతి డిప్యుటేషన్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అట్టి అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారని ఆయన తెలిపారు. డిప్యుటేషన్లపై ఉపాధ్యాయులు బదిలీ కావడం వలన పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి ఈ డిప్యుటేషన్లు రద్దు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వార్డుల వారీగా అభివృద్ధి

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 22: వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ అన్నారు. మంగళవారం పెద్దఅంబర్‌పేటలోని పోలీస్‌కాలనీలో రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. పనులు సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యతగా చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రగతి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్దెంకి కృష్ణారెడ్డి, రాజేందర్, కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈ శివానందం, నాయకులు విజయేందర్‌రెడ్డి, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

సాయినాథ్‌తో పాటు వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

ఆమనగల్లు, అక్టోబర్ 22: ఆమనగల్లు పట్టణానికి చెందిన వీరమల్ల ఊర్మిళ రాధాకృష్ణమూర్తి దంపతుల కుమారుడు సాయినాథ్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం సాయినాథ్, వారి తల్లిదండ్రులను నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథం, మండల గౌరవ అధ్యక్షుడు యాదయ్య, మండల, పట్టణ అధ్యక్షుడు గణేశ్, రమేశ్, సంఘం నాయకులు యాదగిరి, బాలు, రామచంద్రయ్య, రాజు, సురేశ్, అడివయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

మాదన్నపేట, అక్టోబర్ 22: జైలు అధికారులు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా అన్నారు. పలు కార్యక్రమాలు నిర్వహించి చట్టాలపై ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ సహకారంతో మంగళవారం తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ కొత్త క్రిమినల్ చట్టాలపై జైలు అధికారులకు సెన్సిటైజేషన్ –2023 అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులకు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ.. పలు రాష్ట్రాల నుంచి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఐజీలు రాజేశ్, మురళీబాబు, న్యాయ వ్యవస్థ నుంచి ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, అక్టోబర్22: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీఐ శంకర్‌కుమార్ కథనం ప్రకారం.. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తులేఖుర్దు గ్రామానికి చెందిన రాఘవేందర్ (35) గత ఆగస్టు 9న తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి యాచారం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం రాఘవేందర్ బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో రాఘవేందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. రెండు నెలలకు పైగా దవాఖానలో చికిత్స పొందిన రాఘవేందర్ మృత్యువుతో పోరాడి చివరకు తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆర్కేపురం, అక్టోబర్ 22: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని శివాని మహిళా కళాశాల చైర్మన్ పి.రామ్‌రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ వెదిరే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ క్యాపిటల్ సహకారంతో యశోద హాస్పిటల్, ఎంజేఎం హాస్పిటల్, మాక్స్ విజన్, క్లౌవ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్రెస్ట్ క్యాన్సర్, డెంటల్ పరీక్షలు, కంటి పరీక్షలు, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ హైదరాబాద్ క్యాపిటల్ సహకారంతో యశోద హాస్పిటల్, ఎంజేఎం హాస్పిటల్, మాక్స్ విజన్, క్లౌవ్ డెంటల్ హాస్పిటల్ ముందుకు వచ్చి 500 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, విద్యార్థులు, హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 22: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని షాద్‌నగర్ ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి ఆకాశ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.800కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యారంగానికి సంబంధించిన ప్రతి సమస్యనూ పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా కలెక్టరేట్ ముట్టడికి షాద్‌నగర్ నుంచి 500మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విజయ్, నరేశ్, రాథోడ్, రమేశ్, గణేశ్, విజయ్ పాల్గొన్నారు.

కాటమయ్య రక్ష కిట్లు అందించాలి

సేఫ్టీ కిట్లు అందజేయాలని ఎక్సైజ్ ఎస్‌ఐలను కోరుతున్న గౌడ సంఘం నాయకులు

మాడ్గుల, అక్టోబర్22: కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం కాటమయ్య రక్ష కిట్స్ అందజేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహాగౌడ్ అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలోని మంగళవారం ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు స్వప్న, కృష్ణ ప్రసాద్‌లను కలిసి మండలంలోని ఉన్న సుద్దపల్లి, ఆవురుపల్లి, బ్రాహ్మణపల్లి, నల్లవారిపల్లి, ఆర్కపల్లి, కలకొండ, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఉన్న కల్లు గీత కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేయలని వారు కోరారు. కార్యక్రమంలోని గౌడ సంఘం నాయకులు జగన్ గౌడ్, శివగౌడ్, సత్యంగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

కందుకూరు, అక్టోబర్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి నరసింహ తెలిపారు. నేదునూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను సందర్శించి.. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నారా? మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నట్లు వివరించారు. పీఎంశ్రీ పథకం కింద రూ.13.5లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. నూతన గదుల నిర్మాణానికి రూ.4.5లక్షలు, మరమ్మతులకు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమ్మ ఆదర్శ కమిటీ కింద రూ.8లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. పనుల త్వరగా ప్రారంభించాలని డీప్యూటి డీఈ ఖలీముద్దీన్ చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, ఎడ్యుకేషన్ ఇంజినీయర్ శ్రీనివాస్, సీఆర్‌పీ వెంకటేశ్. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 22: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా సెల్ నంబర్ 9959226287కు ఫిర్యాదు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 22 : వరి పంటల కోతలు ప్రారంభమైనందున వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించటంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా వరిపంటకు బోనస్ వెంటనే అందించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, రాష్ట్ర ఉత్తమరైతు అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని కోరారు.

1న వ్యవసాయ కార్మిక సంఘం సెమినార్

చేవెళ్లటౌన్, అక్టోబర్ 22: నవంబర్ 1వ తేదీన నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి సెమినార్‌కు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించే సెమినార్‌కు సంబంధించి కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల, మండల నాయకులు స్వరూప, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, కిష్టయ్య ఉన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

సైదాబాద్, అక్టోబర్ 22: కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్ ఆయుష్‌లో సంస్థ 9వ ఆయుర్వేద దినోత్సవం–24ను పురస్కరించుకొని 'ప్రపంచ ఆరోగ్యానికి ఆయుర్వేద ఆవిష్కరణలు' అనే అంశంపై మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయుర్వేద సీనియర్ రీసెర్చ్ సింధు, చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్య విధానాన్ని అవలంబించటం ద్వారా అనేక రోగాలను నయం చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఆయుష్ లైబ్రేరియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.